ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో క్లీనప్ డ్రైవ్



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న విద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని కేంద్రీయ విద్యాలయ ప్రాంగణంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, శానిటేషన్ విభాగం, హార్టికల్చర్ విభాగం అధికారులు, సిబ్బంది ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య పర్యవేక్షణలో క్లీనప్ డ్రైవ్ నిర్వహించారు. ప్రాంగణంలోని చెట్ల నుంచి ఎండిన ఆకుల కుప్పలు, పొదలు, చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. తొలగించిన వాటిని ట్రాక్టర్ల ద్వారా డంప్‌యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రతి శనివారం హెచ్‌సీయూ క్యాంపస్‌లో క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. క్యాంపస్‌ను మరింత పరిశుభ్రమైనది మార్చడమే లక్ష్యంగా ఎన్‌ఎస్‌ఎస్ సెల్ పనిచేస్తుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, శానిటేషన్, హార్టికల్చర్ విభాగాల సహకారంతో చేపట్టే క్లీనప్ డ్రైవ్‌లో విద్యార్థులంతా పాల్గొని క్యాంపస్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌లో మరింతగా అభివృద్ధి చేయడంలో చేయూత తమవంతూ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ భీంసింగ్, ఉద్యానవనశాఖ నుంచి సుదాకర్, మహేందర్, రెండు విభాగాల సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్ క్రీడాకారులకు ప్రోత్సాహకం

హఫీజ్‌పేట్: జాతీయ, రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ చూపించిన రంగారెడ్డి మాస్టర్లకు హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో నిర్వహించిన ప్రోత్సాహక కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్, రంగారెడ్డి మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొండ విజయ్‌కుమార్ నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు ప్రోత్సాహకం అందించడంలో తమ ఫౌండేషన్ ముందు ఉంటుందన్నారు. జాతీయ మాస్టర్స్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన జానకి మిత్రా సుంకర మల్లేశ్వరి, దుర్గా గోపాలకృష్ణన్, రంగారెడ్డి జిల్లా మాస్టర్ అథ్లెట్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాల్లో పథకాలు సాధించిన సుమారు 60 మాస్టర్ క్రీడాకారులకు నగదును హోప్ ఫౌండేషన్ ద్వారా అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నూనె సురేందర్, ట్రెజరర్ స్వాతిగౌడ్, చిరంజీవులు, కోచ్ డగ్లస్, జ్యోతి, శివలీల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న హోప్ ఫౌండేషన్ చైర్మన్

రవీంద్రభారతి పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని రవీంద్రభారతీ పాఠశాలలో శనివారం వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఇక్రిసాట్ సైంటిస్ట్ డాక్టర్ జగదీశ్ తిలకించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఈ ప్రదర్శనలను ఏర్పాటు చేయడం వల్ల వారిలో దాగివున్న సృతనాత్మకతను వెలికితీయవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తయారు చేసిన చంద్రమండలం చమద్రయాన్–3 అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. నేటి సమాజంపై సైన్స్ ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగరాజు, కేపీహెచ్‌బీ డీన్ శ్రీలత, డివిజన్ ఇన్‌చార్జి హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు అదనపు సొగసు డయాస్పోరా సాహిత్యం

రాయదుర్గం: తెలుగు భాషకు అదనపు సొగసు డయాస్పోరా సాహిత్యమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగం హెడ్ ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని తెలుగు విభాగం నుంచి శనివారం ఆన్‌లైన్ ద్వారా తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు మల్లి సహకారంతో ఆచార్య అయ్యగారి సీతారత్నం సమన్వయకర్తగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన ప్రసంగించారు. డయాస్పోరా సాహిత్యం కొత్త విలువల్నీ, కొత్త ఆలోచనలన్నీ అందిస్తుందన్నారు. డయాస్పోరా సాహిత్యాన్ని వలస సాహిత్యంమనీ పిలుస్తున్నారన్నారు. కానీ వలస వెళ్లినా ఇష్టపూర్వకంగా వెళ్లి ఆయా ప్రాంతాలు ఆయా దేశాల్లో స్థిరపడిన వాళ్లు ఆ ప్రాంతాల జీవన స్థితిగతులతో మమేకమవుతూ రాస్తున్న సాహిత్యం డయాస్పోరా సాహిత్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

పూడికతీతను వెంటనే తొలగించాలి



హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలోని వరద నీటి కాల్వలో పూడిక తీసి రోడ్డుపై వేసిన దృశ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ వరద నీటి కాల్వల్లో పూడిక తీసి రోడ్డుపైనే వేశారు. వరద నీటి కాలువల్లో పూడిక తీసి వర్షపు నీరు సాఫీగా నాలాల్లోకి వెళ్లేలా చూడటం ప్రధాన లక్ష్యం. అందుకోసం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం పూడిక తీస్తోంది, కానీ తీసిన పూడికను వెంటనే తొలగించకపోవడంతో సమస్య పునరావృతం అవుతుంది. రెండు మాసాల క్రితం హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో తీసిన పూడిక అక్కడే తిష్ట వేయగా, వారం రోజుల క్రితం శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా పూడిక కూడా అక్కడే ఉండటం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తీసిన పూడిక తిరిగి కాల్వల్లోకే చేరుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణ కొరవడిందని పలువురు ఆరోపిస్తున్నారు. అలా కాకుండా తీసిన పూడికను వెంటనే తొలగించాల్సిన కాంట్రాక్టర్లు వాటిని నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో స్థానికులు వెంటనే పూడికను తొలగించేలా జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

మియాపూర్: మియాపూర్‌లోని 100, 101 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న, బై నంబర్లతో రిజిస్టర్ చేసిన, బై నంబర్ స్థలాలకు భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని జనంకోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంకను కలిసి ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీప్తిశ్రీనగర్ కాలనీ, చుట్టుపక్కల ప్రాంతంలో 100, 101 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుని దీప్తిశ్రీనగర్ సర్వే నంబర్ 150లలోని ప్లాట్ల బై నంబర్లతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని వాటిపై భవన నిర్మాణ అనుమతులు అక్రమంగా తీసుకుని నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారిపై, వారికి సహకరించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కబ్జాలను అరికట్టాలని గతంలో హెచ్‌డీఎం కమిషనర్, రాజేంద్రనగర్ ఆర్డీవో, శేరిలింగంపల్లి తహసీల్దార్, జోనల్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేయడం జరిగిందని, చర్యలు తీసుకోని పక్షంలో సుప్రీంకోర్టు, లోకయుక్త దృష్టికి తీసుకువెళ్తామని జనంకోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు.

బ్యాంకును మోసం చేసిన కేసులో మరొకరి అరెస్ట్

రాయదుర్గం: బ్యాకుకు మోసం కేసులో నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. సైబరాబాద్‌లోని ఆర్థిక నేరాల విభాగం సైబరాబాద్ పోలీసులు నిందితుడు మహ్మద్ ఫైజ్ అహ్మద్‌ను అరెస్ట్ చేశారు. ఈఓడబ్ల్యూ పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు నకిలీ పత్రాలను సమర్పించి బాలానగర్‌లో కెనరా బ్యాంక్‌లో రూ.1.30 కోట్లను రుణ మొత్తాన్ని స్వీకరించాడు. అనంతరం రుణం చెల్లించడంలో విఫలమైన ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించడంతో అతడిని ఈఓడబ్ల్యూ పోలీసులు అరెస్ట్ చేశారు. బాలానగర్ కెనరా బ్యాంక్ జీఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి అతడిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా శనివారం రామాంతపూర్‌లో మహ్మద్ ఫైజ్ అహ్మద్‌ను అరెస్టు చేశారు. ఫిబ్రవరి 20న శ్రీనివాసబాబు మాజీ చీఫ్ మేనేజర్ కెనరా బ్యాంక్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మహ్మమ్ చాంద్ పాషా పరారీలో ఉన్నారు. వీరి ముగ్గురిపై ఆరోపణలు వచ్చాయి. అరెస్ట్ చేసి నిందితుడు ఫైజ్ అహ్మద్‌ను కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

సందడిగా ‘టీ హబ్’ ప్రాంగణం





టీహబ్‌లో నిర్వహించిన సమ్మిట్ దృశ్యాలు

గచ్చిబౌలి: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో శనివారం సందడి వాతావరణం నెలకొంది. యూజీఎస్ అండర్ గ్రాడ్యుయేట్ సమ్మిటను స్టూడెంట్ ట్రైబ్ సంస్థ నిర్వహించింది. ఈ సమ్మిట్‌లో ఐఏఎస్ అధికారి జీవీఎస్ పవనదత్త, ఐఆర్‌ఎస్ అధికారులు తరుణ్‌రెడ్డి, గాయత్రి, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, సినీ గాయకులు రేవంత్, దామిని, ప్రణవ్ కౌశిక్, ప్రీతి పగడాల స్టాండప్ కమీడియన్ రాజశేఖర్ మామిడన్న, వంటలక్క కుమారీ ఆంటీ పాల్గొన్నారు. ఆయా రంగాల్లో వారు సాధించిన ప్రగతిని వివరించడంతో పాటు యువతకు ప్రోత్సాహిన్నిచ్చే, స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలు చేశారు. ముఖ్యంగా యువత తాము ఎంపిక చేసుకున్న రంగంలో రాణించేందుకు, పోటీని తట్టుకొని నిలబడుతూ ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరూ ఏ రంగంలో రాణించినా ఆయా రంగాల్లో ప్రోత్సహించే సంస్కృతి అవసరమన్నారు. ఉన్నత విద్యనభ్యసించేవాళ్లు వ్యాపార రంగంలో అడుగులు వేయానుకునే అండర్ గ్రాడ్యుయేట్ల కోసం అనేక మంది నిపుణులతో ఇంటరాక్టివ్ కావాలని సూచించారు. అనంతరం పలు చర్చాగోష్టి కా ర్యక్రమాలను నిర్వహించారు. స్టూడెంట్ ట్రైబ్ నిర్వాహకులు చరణ లక్కరాజు మాట్లాడుతూ.. మరిన్ని రంగాల్లో ఔత్సాహిక అడుగులు వేస్తున్నారని, వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో రాణించడం సులువన్నారు. యువతకు ప్రత్యేక మార్గదర్శనం చేస్తూ ప్రోత్సహిస్తే మనదేశంలో అనేక అద్భుతాలను సృష్టిస్తారన్నారు. అనంతరం యువ గాయకులు ఆలపించిన గీతాలు, రకరకాల కార్యక్రమాలు యువతను ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత పలువురిని సన్మానించి మెమొంటోలను అందజేశారు.

హమీద్‌కు పీహెచ్‌డీ



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ ప్రకటించారు. ‘మనూ’లో గణితం విభాగంలో ఏ.బీ.హమీద్ కవాకు ఈ డిగ్రీని ప్రకటించారు. ఆయన ‘డెరివేషన్స్ ఆన్ రింగ్స్ అండ్ ఆల్జీబ్రాస్’ అనే అంశంపై గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ సయ్యద్ నజ్మల్ హసన్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించగా దాన్ని పరిశీలించి హమీద్‌కవాకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.

ప్రత్యేక పూజలు



వేడుకల్లో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ గ్రామంలోని శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం 16వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై కల్యాణమహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గౌతమ్ గౌడ్, వాలా హరీష్‌రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, రామకృష్ణ గౌడ్, వెంకటే ష్ గౌడ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం పద్మశ్రీ శోభరాజు విద్యార్థిని గాయత్రి సింధూజ వేదుల సంగీత కచేరిని నిర్వహించారు. గణరాజగణరాజ, వందేహం గురుదేవ, అదిగో అల్లదిగో, అప్పమైన నీయరే, సకలబలంబులు, పొడగంటిమయ్య అంటు అన్నమయ్యకీర్తనలను ఆలపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. కీబోర్డు సత్యదేవ్, బి.వి రమణామూర్తి వాయిద్య సహకారాన్ని అందించారు.

తనూజకు డాక్టరేట్

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని అన్నా తనూజ సఫాలాను డాక్టరేట్ వరించింది. ‘బయోమాక్రో మోలిక్యూల్స్ తో బెంజిమిడాజోల్ కంజెనర్ల పరస్పర చర్యపై సమగ్ర బయోఫిజికల్, సిద్ధాంతక అధ్యయనం’ చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కేతన్ సాహు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డీఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించారు.

నిర్విరామంగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు డివిజన్ పరిధిలో ప్రణాళికా బద్ధంగా నిధులు కేటాయిస్తూ, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో రూ. 1.63 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లు, వరద నీటి పైపులైను నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వస్తుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అనిరుద్ యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ ఆరంభ టౌన్‌షిప్‌లో జేసీఐ సికింద్రాబాద్ వాకర్ టౌన్, సిటిజన్ హాస్పిటల్స్ సంయుక్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బీఆర్‌ఎస్ యువ నాయకులు రాగం అనిరుద్ యాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిరుద్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయం అన్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే డాక్టర్ వద్ద వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇలాంటి వైద్య శిబిరాల నిర్వహణకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరంభ టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్ర రాథోడ్, జేఎఫ్‌ఎం జోన్ వైస్ ప్రెసిడెంట్ ఆయుష్ సరేగి, జేఎఫ్‌ఎం జోన్ డైరెక్టర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ శ్రేయ దీక్షిత్, ప్రెసిడెంట్ గాయత్రి, సెక్రటరీ హరి ప్రసాద్, ప్రాజెక్టు చైర్మన్ సుమతి, బీఆర్‌ఎస్ నాయకులు అభిషేక్ యాదవ్, ఆరంభ టౌన్‌షిప్ ప్రతినిధులు మధుసూదన్ రెడ్డి, రాజేష్, రెహానా బేగం, అరుణశ్రీ, మహేష్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ఈద్గవాని కుంటలో మట్టి తొలగింపు



మట్టిని తొలగించే పనులు చేపట్టిన నీటిపారుదల శాఖ అధికారులు

గచ్చిబౌలి: గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని ఈద్గవాని కుంటలో మట్టిని తొలగించారు. నీటి పారుదల శాఖ ఏఈ జ్యోతిర్మయి పర్యవేక్షణలో సిబ్బంది ముందుగా ఈద్గవాని కుంటను పరిశీలించి మట్టిపోసినట్లుగా గుర్తించి దాన్ని శనివారం తొలగించే ఏర్పాట్లు చేశారు. జేసీబీలు, టిప్పర్ల సహకారంతో మట్టిని తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెరువులు, కుంటలను ఎవరైనా కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువుల పరిసరాల్లో కూడా మట్టి, వ్యర్థాల పారవేస్తే కూడా తగిన చర్యలు తీసుకోవడమే కాకుండా అవసరమైతే పోలీసు కేసులు పెట్టడానికి కూడా వెనుకాడమని స్పష్టం చేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించి కళాకారులు అలరించారు. ఇందులో మహా గణపతిం, సరస్వతి స్తుతి, నీలమేఘ శరీర, అష్టలక్ష్మీస్తోత్రం, లింగాష్టకం, గరుడగమన, మంగళం తదితర అంశాలను గురువు లక్ష్మీశ్రీనాయుడు, గౌరీ, శ్రేష్ఠసాయి, రాసి, ఇషిత, రిత్వి, తదితరులు ప్రదర్శించి సందర్శకులను అలరించారు. – మాదాపూర్

మంచి మార్కులు సాధించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పదవ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని ఈదుల నాగులపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోచయ్య అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ అందించేందుకు మున్సిపల్ వైస్ చైర్మన్‌రాములు గౌడ్ కుమారుడు సాయిచరణ్ గౌడ్ ముందుకు రావడం హర్షదాయకమన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

పటాన్‌చెరు: రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం 6 గ్యారంటీ పథకాల్లో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను ప్రారంభించిన నేపథ్యంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ బీరంగూడ శివాలయం చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్ మున్నా , మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల రమేశ్ యాదవ్, భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, చేనేత విభాగం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ నేత, పార్టీ ప్రధాన కార్యదర్శి రమేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌పై హర్షం వ్యక్తం చేస్తూ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేశ్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం రామచంద్రాపురం పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

బస్‌పాస్ మేళాకు స్పందన

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని బస్టాండ్‌లో శనివారం నిర్వహించిన దివ్యాంగుల బస్ పాస్ మేళాకు స్పందన వచ్చినట్లు టీఎస్‌ఆర్టీసీ హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళీధర్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 108 మంది దివ్యాంగులకు బస్ పాస్‌లు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బస్ పాస్ ఏటీఎం నిర్వాకుడు మహేశ్‌కుమార్, సీఐలు ప్రశాంత్ కుమార్, ధనుంజయ్ ఆర్టీసీ సిబ్బంది మధు, ఉదయ్ కుమార్ , బాసప్ప, మహేశ్ గౌడ్ పాల్గొన్నారు.

గచ్చిబౌలి, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ల బదిలీ

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓ బి.జేమ్స్‌బాబును ఏహెచ్‌టీయూ సైబరాబాద్‌కు బదిలీ చేశారు. అల్లాపూర్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.ఆంజనేయులును గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. రాయదుర్గం ఎస్‌హెచ్‌ఓ మహేష్‌ను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌ఓ సీహెచ్.వెంకన్నను రాయదుర్గం ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. రాయదుర్గం డీఐ చంద్రశేఖర్‌ను షాద్‌నగర్ ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా, వీఆర్‌లో ఉన్న హరిభూషణ్‌ను రాయదుర్గం డీఐగా, సైబర్‌క్రైమ్‌లో ఉన్న శ్రీనివాస్ గౌడ్‌ను గచ్చిబౌలి డీఐగా బదిలీ చేశారు.

ఉత్సాహంగా 2కే రన్



2కే రన్‌లో కాలనీవాసులతో జగదీశ్వర్ గౌడ్

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కేఎస్ఆర్ 2 గెదర్‌ర్నెస్ అపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 2కే రన్ ఉత్సాహంగా శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం వ్యాయామం చేస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు దరి చేరవన్నారు. అనంతరం గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో నెలకొన్న సమస్యలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు.

బొటానికల్ గార్డెన్‌లో ఉచిత వైద్యశిబిరం

గచ్చిబౌలి: కొత్తగూడలో తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని బొటానికల్ గార్డెన్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వ హించారు. ఎకోటూరిజమ్ వింగ్ ఆధ్వర్యంలో హోలిస్టిక్ ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో ఉద్యోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎఫ్‌డీసీ ఈడీ రంజిత్‌నాయక్, రీజనల్ మేనేజర్ డీవీరెడ్డి, జీఎం సైకిలాబ్ కలిసి ప్రారంభించారు. అనంతరం రంజిత్‌నాయక్ మాట్లాడుతూ.. రిజర్వుఫారెస్ట్ ప్రాంతంలో పనిచేసే ఉద్యోగులకు ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్లు విశ్వనాథ్, సద్గురు నాగరాజు పర్యవేక్షణలో బీపీ, షుగర్,బరువు, ఈసీజీ, 2డీ ఎకో ఇతర వైద్య పరీక్షలను 110 మందికి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కిరణ్‌కుమార్, పుష్పలత, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, మధుసూధన్, వీరకిషోర్, శ్రీనివాస్, శాంసన్, భాస్కర్ పాల్గొన్నారు.

సున్నం చెరువులో అక్రమ కట్టడాల కూల్చివేత



మాదాపూర్: సున్నం చెరువులో అక్రమంగా నిర్మించిన కట్టడాలను అధికారులు శనివారం కూల్చివేశారు. దాదాపు ఐదు నిర్మాణాలను కూల్చివేశారు. ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో అక్రమంగా నిర్మాణాలను చేయరాదని చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ, మండల గిర్దావర్ ఆర్ల శ్రీను తెలిపారు. అక్రమ కట్టడాలను ఉపేక్షించేది లేదన్నారు. ఎవరైన కట్టడాలను నిర్మిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు.

శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



జగదీశ్వర్ గౌడ్‌ను కలిసిన సోమేశ్వర దేవస్థానం నూతన కమిటీ సభ్యులు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల సోమేశ్వర దేవస్థానం నూతన కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్‌ను శనివారం కలిశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని నూతన సభ్యులకు సూచించారు. సోమేశ్వర దేవస్థానం నూతన సభ్యులు పురం విజేందర్‌రెడ్డి, శోభ, మరమల్ల భాగ్యమ్మ, శివకుమార్, లక్ష్మీనారాయణ, శివకుమార్ గౌడ్, రాగం సాయికుమార్‌గా నియమించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.